కథ

# సరైన నిర్ణయం

''ఎవరు మీరు'' తలుపు తీస్తూ అడిగింది పల్లవి.

''విశ్వంగారి ఇల్లేనా?'' పల్లవి ప్రశ్నకి జవాబివ్వకుండా ఎదురు ప్రశ్నించింది ఆమె.

''ఇది విశ్వంగారి ఇల్లే. ఇంతకీ మీరెవరో చెప్పారు కాదు''

ఆమెని చూపులతో గుచ్చుతూ అన్నది పల్లవి. ఎవరో పరాయి స్త్రీ తన భర్తని వెతుక్కుంటూ రావడం ఆశ్చర్యంగా అనిపించింది పల్లవికి.

''కొంచెం లోపలికి రానిస్తారా'' అభ్యర్థిస్తున్నట్టు అన్నది ఆమె.

అయిష్టంగానే పక్కకి తొలగింది పల్లవి. ఆమె లోపలికి వచ్చింది. తెల్లగా సన్నగా లిల్లీ పువ్వులా ఉన్నది. ఎండలో నడచి రావడం వల్ల ముఖమంతా ఎర్రగా కంది పోయింది. నుదుటి మీద స్వేదబిందువులు గాజుపూసల్లా మెరుస్తున్నాయి.

''కొంచెం మంచినీళ్ళు ఇప్పిస్తారా''

పల్లవి మంచినీళ్ళు తెచ్చింది. మర్యాద కోసమైనా ఆమెని కూర్చోమనలేదు.

గడగడా నీళ్ళు తాగి ఇక నిలబడే ఓపికలేనట్టు ఆమె కుర్చీలో కూర్చుండిపోయింది.

''ఇప్పుడైనా చెప్తారా మీరెవరో. విశ్వంగారికి మీరేమవుతారు? స్నేహితులా? బంధువులా?''

''నా పేరు ప్రమోద''

పల్లవి ఉలిక్కిపడింది. ఆ పేరు ఎక్కడో విన్నది. ఎక్కడ?

''మావారికి మీరేమవుతారు?''

ప్రమోద ఏదో ఆలోచిస్తున్నట్టు మౌనంగా కూర్చుంది. ఆమె మౌనం పల్లవిలో అనుమానం పెంచుతోంది. అనుమానం పెరిగే కొద్దీ మనసులో అశాంతి. అది కోపంగా మారుతోంది. అయినా తమాయించుకుంటోంది. ఈమె ఎందుకొచ్చిందో ఏవిటో తెలుసుకునే వరకైనా సంయమనంతో వ్యవహరించాలి అనుకుంది పల్లవి.

''చూడండీ... ఇంత దూరం వచ్చి మీరు మౌనంగా ఉండడంలో అర్థం లేదు. ఒకవేళ మీరు మా వారితో పర్సనల్‌గా మాట్లాడాల్సిన విషయమైనా తరువాత నాకు తెలీకుండా పోదు. ఎందుకంటే ఆయన నా దగ్గర ఏ విషయాలూ దాచరు''

ప్రమోద చటుక్కున తలెత్తి చూసింది. అదోలా నవ్వింది. ''మీ మధ్య ఏ రహస్యాలు లేవన్నది నిజమైతే, నా పేరు ప్రమోద అన్నప్పుడే మీకు నా గురించి తెలిసిపోయి ఉండాలి''

ఛెళ్ళున చరచినట్లైంది పల్లవికి. తన మాట తనకే తిప్పికొట్టిన ఈమె పైకి కనిపించేటంత అమాయకురాలు మాత్రం కాదు. ఆలోచిస్తున్న పల్లవికి లీలగా గుర్తొస్తోంది. ఎపుడో పదేళ్ళ క్రితం విన్నదీ పేరు. అదీ తన భర్త నోటి వెంట. అంటే... ఈ ప్రమోద, తన భర్త ఒకప్పుడు ప్రేమించీ పెళ్ళి చేసుకోలేకపోయిన ప్రియురాలా? విశ్వం తను ప్రమోద అనే అమ్మాయిని ప్రేమించీ, తల్లి బెదిరింపులకు లొంగి తనని చేసుకుంటున్నానని చెప్పాడు. ఈ విషయంలో తనకి అసంతృప్తి అనిపించినా అతని నిజాయితీకి, కట్నం వద్దన్న అతని సంస్కారానికి లోబడి అతనితో పెళ్ళికి ఒప్పుకుంది.

పల్లవి ఆమె వంక పరీక్షగా చూసింది.

తన భర్త కోరుకున్న ప్రమోద తనకన్నా ఎంతో అందంగా ఉంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే ఇప్పుడు తన స్థానంలో ఉండవలసిన స్త్రీ. కానీ అదంతా గతం. ఇప్పుడు తను విశ్వం అగ్నిసాక్షిగా పెళ్ళాడిన అతని భార్య. మరి ఇప్పుడు ఈమె రాకలోని ఆంతర్యం? ప్రశాంతమైన తమ సంసార సాగరంలో తుపాను రేగబోతోందా? ఇపుడు తనది ఒక విచిత్రమైన పరిస్థితి. ఏ భార్యకూ ఎదురు కాకూడని పరిస్థితి.

ఒంట్లోని శక్తినంతా ఎవరో లాగేసినట్టు నీరసం ముంచుకొచ్చింది పల్లవికి. అలసటగా కుర్చీలో వెనక్కి వాలింది.

ఆమె మనఃస్థితిని పట్టించుకోని ప్రమోద చెప్పుకుపోతోంది.

''నేనొక అనాథని. ఎవరికి పుట్టానో, నన్ను పెంచిన అనాథాశ్రమం వారికి ఎక్కడ దొరికానో నాకు తెలియదు. ప్రేమరాహిత్యం, అభద్రతా భావం నీడల్లో, బతుకు భయంతో పదోక్లాసు చదివి వృత్తివిద్యలో శిక్షణ పొందాను. సరిగ్గా అలాంటి సమయంలోనే మీ భర్త విశ్వంగారితో పరిచయమైంది. ఆయన సాన్నిహిత్యంలో జీవితంలో మొదటిసారిగా ప్రేమ మాధుర్యాన్ని చవి చూశాను. తాళి కట్టించుకోలేకపోయినా ఒక భార్య భర్తని ఎంత సిన్సియర్‌గా ప్రేమిస్తుందో అంతగా ప్రేమించాను విశ్వంగారిని. ఆయన మీది నమ్మకంతోనే ఆయనకు దగ్గరయ్యాను.

నేను అనాథనైన కారణంగా విశ్వంగారి తల్లికి నన్ను కోడలిగా చేసుకోవటం ఇష్టం లేదు. నాకు అన్యాయం చేయలేకా తల్లిని ఒప్పించలేకా విశ్వం నలిగిపోయాడు. తల్లి మాట మన్నించీ, జన్మనిచ్చి ఇంతవాడిని చేసినందుకు ఆమె ఋణం తీర్చుకోమంటూ నేను తప్పుకున్నాను. కానీ అప్పటికే నాకు మూడో నెల''

పల్లవి ఉలిక్కిపడింది. తన భర్త ప్రమోదని ప్రేమించాననే చెప్పాడు కానీ... శారీరక సంబంధం కూడా ఉందన్నమాట. పల్లవికి భర్త మీద అసహ్యం వేసింది.

''అబార్షన్ చేయించుకున్నారా'' క్షీణించిన స్వరంతో అన్నది పల్లవి.

''లేదు''

''పెళ్ళి కాకుండా తల్లి అవబోతున్న ఆడది చేసే పనే అది కదా''

''నా దేహంలో దేహం, ప్రాణంలో ప్రాణం- నేను మనసారా ప్రేమించిన విశ్వం ప్రతి రూపాన్ని చంపుకోవాలని నాకనిపించలేదు''

''అందువలన ఎన్ని అవమానాలు ఎదుర్కోవాలో తెలీదా మీకు''

''తెలుసు. తల్లిలేని పిల్లలంటే జాలిపడే ఈ లోకం, తండ్రిలేని పిల్లల్ని చులకన చేస్తుంది. చిన్న చూపు చూస్తుంది. ఎవరేమనుకున్నా లెక్క చేయకుండా నా బిడ్డని ఇన్నేళ్ళూ పెంచుకున్నాను. కానీ..నన్ను వెన్నంటి ఉండే దురదృష్టం కాన్సర్ జబ్బు రూపంలో నన్ను మరోసారి వెక్కిరించింది. నేను ఎక్కువకాలం బతకను. చావు పొంచి ఉన్నదనే భయం లేదు నాకు. నా తరువాత నా బిడ్డ అనాథలా మిగిలిపోతాడనే బాధ తప్ప'' ప్రమోద గొంతు వణికింది.

పల్లవికి ఆమె రాకలోని ఆంతర్యం కొద్ది కొద్దిగా అర్థమౌతోంది.

ఈ భూమ్మీద కొందరు కష్టాలకే పుడతారేమో! పల్లవికి ఆమె మీద జాలి అనిపించింది. జరిగిన దాంట్లో ఆమె తనకు చేసిన ద్రోహమేమీ లేదు. తమ పెళ్ళయిన పదేళ్ళలో ఒక్కసారి కూడా ఆమె తమ సంతోషానికి అడ్డురాలేదు. ఎక్కడో, ఎవరికో పుట్టింది. ఆత్మస్థైర్యంతో కష్టాల నధిగమించింది. స్వావలంబన సాధించింది. ప్రేమించి,

నమ్మిన నేరానికి శిక్షని కన్నది. తను పోతానని తెలిసినప్పుడు తన బిడ్డకి భద్రత నివ్వమని కోరడానికే తనింటికి వచ్చింది.

"సాటి స్త్రీగా నన్ను అర్థం చేసుకొంటారనే ఆశతోనే ఓ కోరిక కోరతాను మీరు మన్నిస్తారనే అనుకుంటున్నాను"

అర్థమయినట్లు చూసింది పల్లవి.

"మీ భర్త రక్తం పంచుకుపుట్టిన నా బిడ్డని మీ బిడ్డగా స్వీకరించండి. వాడికి భద్రత కల్పించండి" అభ్యర్థనగా అన్నది.

పల్లవి ఒక్క క్షణం ఆలోచించింది. తనకెలాగా తల్లి అయే యోగ్యత లేదు. ఎవర్నో తెచ్చి దత్తత చేసుకునే బదులు ఈ బిడ్డని పెంచుకుంటే నష్టమేమిటి!

"ఇక నుంచి మీ బిడ్డ బాధ్యత మాది. మీరు దిగులుపెట్టుకోకండి" ప్రమోదని అనునయిస్తూ అన్నది.

ప్రమోద కళ్ళు కృతజ్ఞత కురిపించాయి. "మీ మేలు జన్మ జన్మలకీ మరచిపోలేను. విశ్వం గారికి ఒకసారి నన్ను కలవమని చెప్పండి" తమ్ముడి ఇంటి గుర్తు చెప్పింది ప్రమోద.

★ ★ ★

అలసటగా వచ్చిన విశ్వం ఎ.సి. ఆన్ చేసుకొని సోఫాలో రిలాక్సవుతున్నాడు.

"ప్రమోద వచ్చిందండీ" అతనికి కాఫీ అందిస్తూ అన్నది పల్లవి.

"ప్రమోద వచ్చిందా... ఎపుడూ?"

ఆ పేరు వినగానే భర్త కళ్ళలో మెరుపు! ఆయన గుండెల్లోతుల్లో ప్రమోద మీద ప్రేమ ఇంకా స్థిరంగానే ఉందా!

"ఎప్పుడొచ్చింది? ఎందుకొచ్చింది?"

పల్లవి జరిగినదంతా చెప్పింది.

"బాబుని పెంచుకుంటానని మాటిచ్చావా? నిజంగా నువ్వెంత మంచిదానివి పల్లవీ!"

"తప్పు చేసింది మీ ఇద్దరూ అయినప్పుడు బాధ్యత మాత్రం ఇద్దరిదీ అవదా? తప్పు చేసిన ప్రతి మనిషికీ దిద్దుకునే అవకాశం కూడా ఉంటుంది. కానీ ఆ తప్పు దిద్దుకోవడానికి సంస్కారం కావాలి. ప్రేమ వ్యక్తిగతం కావచ్చు. ఒక వ్యక్తిని ప్రేమించాలంటే సమాజం అనుమతి తీసుకోనక్కరలేదు కానీ... ఆ ఉద్రేకంలో తప్పు చేసి అక్రమంగా బిడ్డల్ని కని ఏ చెత్తకుండీ పక్కనో వదిలేసి చేతులు దులుపుకుంటే ఆ ఫలితం సమాజం మీద పడక మానదు. గాలికీ, ధూళికీ పెరిగే ఈ పిల్లలు పెద్దవాళ్ళై సంఘ విద్రోహులుగా మారితే అందుకు పరోక్షంగా బాధ్యత ఎవరిది? అసలు ఏ పసివాడైనా అనాథలా ఎందుకు మారతాడు? అందుకు కారణం ఈ అక్రమ సంబంధాలు కాదా? ప్రేమ గొప్పదే కావచ్చు. కానీ మనిషికి నైతిక విలువ ఇంకా గొప్పది. క్షణికోద్రేకానికి లోనై మనిషి నైతిక విలువలు మర్చిపోతే ఫలితాలు ఇలాగే ఉంటాయి. పెళ్ళి చేసుకోగలమనే నమ్మకమున్నప్పుడే మనిషి ప్రేమించాలి.

మీ బిడ్డని పెంచుకుంటానని మాటిచ్చాను. తల్లిగా ప్రమోద ఆరాటాన్ని అర్థం చేసుకున్నాను. అదీ కాకుండా ఇందులో నా స్వార్థం కూడా లేకపోలేదు. నాకెలాగూ తల్లయే అవకాశం లేదని డాక్టరు చెప్పారు కదా!" చెప్పవలసినదంతా చెప్పి పల్లవి వెళ్ళిపోయింది.


ఒంటరిగా మిగిలిపోయాడు విశ్వం. ఎ.సి.లోని చల్లదనం అతనికి హాయి నివ్వటంలేదు. ప్రేమ... మనసుని తాదాత్మ్యంలో ముంచే ఒక స్థితి. ఒక అలౌకిక అనుభూతి! తన ప్రేమ పై పై ఆకర్షణ కాదు. ప్రేమ మెదడులోని ఏ కణాలని ఉత్తేజింపచేస్తుందో, మనిషిలోని ఏ నాడీ తంత్రులని మీటుతుందో శరీరంలో ఏ రసాయనిక చర్యల్ని ప్రేరేపిస్తుందో... మనసునీ, శరీరాన్నీ భావనా లోకంలో విహరింపచేసే అద్భుతశక్తి ప్రేమకి మాత్రమే ఉంది.






సఫలమైన ప్రేమ స్వర్గలోకపు అంచుల వరకు తీసుకెడితే విఫలమైన ప్రేమ నరకమంటే ఏమిటో చూపిస్తుంది! మనిషిని నైరాశ్యంలో ముంచుతుంది. ప్రేమ వైఫల్యాన్ని తట్టుకోలేక కొందరు ఆత్మహత్య చేసుకొంటే మరికొందరు పరిస్థితు

ఆదుర్తి బాల




లతో రాజీపడిపోతారు. క ి అంతరంగంలో అసం తృప్తి అతడిని సూదిలా ాడుస్తూనే ఉంటుంది. ఎపుడో ఎవరూ లేని ఏకా ంతంలో ఒంటరిగా ఉన్నప్పుడు తను స్వంతం చే ుకోలేకపోయిన ప్రేయసిని తలచుకొని ఏడుస్తా ు. తన చుట్టూ ఉన్న మిథ్యాప్రపంచాన్ని వదిలి ప్రేయసి ఒడిలో సేద తీరాలనుకుంటాడు. కానీ సంఘ నియమాలూ, నైతికత, భార్యా, పిల్లలు అతనికి ఆ అవకాశం ఇవ్వవు.

బాధగా నిట్టూర్చాడు విశ్వం. క్షణికావేశంలో చేసిన తప్పు తన జీవితాంతం వెంటాడుతూనే ఉంది. మెకి తను చేసిన ద్రోహం అనుక్షణ అతడిని అశాంతికి గురిచేస్తూనే ఉ ి. ప్రమోదని కాదనుకున్నాక అసలు జీవితంలో పెళ్ళే చేసుకోకూడదన కున్నాడు. అక్కడా అమ్మ తన పంతమే నెగ్గించుకుంది. తమ వంశం ని శమై పోతుందంటూ గోలపెట్టి తమ దూరపు బంధువైన పల్లవి మె డలో మూడుముళ్ళూ వేయిం ంది. ఆమెకి కొడుకు సుఖంకన్నా తన పట్టుదలే ముఖ్యం. తన ప తం నెగ్గినందుకు ఆనందంగా, ని ం తగా కళ్ళు మూసింది. తన ఏం మిగిలింది? సంసార యాంత్రికమైపోయింది స్పందనలు లేని సంసారం, ఉద్యోగం సంపాదన..ఇదే జీవితం తనకి.

''ఏమండీ ఇంకా ఇలాగే ఉన్నారా? త్వరగా స్నానం చేసి రండి. భోం చేద్దాం'' పల్లవి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు విశ్వం.

''రేపే వెళ్ళి బాబుని తెచ్చుకుందాం''



భోజనం చేస్తున్నప్పుడు న్నది పల్లవి. మౌనంగా తలూపాడు విశ్వం.

''చూడండీ! జీవితమంటే కలలు కనడం దు. జీవితాన్ని వాస్తవంగా ఆలోచించాలి. ప్రమో ని అంత గాఢంగా ప్రేమించిన మీరు పెళ్ళి దగ్గర కొచ్చేసరికి పిరికివాళ్ళలా ప్రవర్తించారు. ప్రమోద లేకపోతే చచ్చిపోతానని బెదిరించి ఆమెనే చేసుకొని ఉండాల్సింది. అమ్మగారు కొన్నాళ్ళు బాధపడతారు. అంతేగా ఇంకే అఘాయిత్యమూ చెయ్యరు. ఆ తరువాత ఆవిడని మెల్లిగా మార్చడానికి ప్రయత్నం చేస్తే సరిపోయేది. ఏది ఏమైనా జరిగిపోయిన దాని గురించి బాధపడడం అనవసరం. మన పెళ్ళయి ఇన్నేళ్ళయినా మీరు ఇంకా ఆమెనే తలుచుకుంటూ నన్ను బాధపెట్టడం భావ్యం కాదు. విజయాన్ని స్వీకరించినంత హుందాగా వైఫల్యాన్ని కూడా స్వీకరించగలగాలి. మనకి సాధ్యమైనంతవరకూ సంతోషంగా జీవించడానికి ప్రయత్నించాలి.''

పల్లవి చెప్పడం ఆపి అతడు వింటున్నాడో లేదో అన్నట్టు చూసింది.

''నువ్వు చెప్పింది నిజమే పల్లవీ. కానీ చెప్పడం కన్నా ఆచరించడం కష్టం. ప్రమోదనే తలచుకుంటూ నిన్ను కొంత నిర్లక్ష్యం చేసిన మాట వాస్తవమే. కానీ... ఇక ముందు మారడానికి ప్రయత్నిస్తాను. బాబుని తీసుకొచ్చి ప్రమోదకి నేను చేసిన ద్రోహాన్ని కొంత వరకైనా దిద్దుకుంటాను'' నిశ్చయంగా అన్నాడు విశ్వం. ✪

## ఆర్తీ వారసురాలు

**వారసత్వాల సందడి సినిమా రంగంలో ఈమధ్య ఎక్కువై పోయింది. 'నువ్వు నాకు నచ్చావ్' ద్వారా తెలుగు సినిమా ప్రేక్షకుల మనసు దోచుకున్న ఆర్తీ అగర్వాల్ తన సోదరి 'అదితి'ని టాలీవుడ్‌కి పరిచయం చేస్తోంది. వియంసి ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న కొత్త చిత్రంలో అదితి తెలుగు తెరపై అరంగేట్రం చేయనుంది. సోదరి సినీరంగ ప్రవేశ ఏర్పాట్లలో బిజీగా ఉంది ఆర్తీ అగర్వాల్.**